క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజలో పాల్గొన్న రమణారెడ్డి తదితరులు

చాపాడు : మండల పరిధిలోని చియ్యపాడు దళితవాడలో పట్టాభిరామాలయ నిర్మాణానికి శుక్రవారం భూమిపూజ నిర్వహించారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు పీపీ రమణారెడ్డి రామాలయ నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళిత వాడలో నిర్మించనున్న ఆలయ నిర్మాణానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ఆరు గ్రామాల్లో బీజేపీ ప్రజాపోరు

చాపాడు : మండలంలోని కొత్తరాజువారిపేట, అనంతపురం, తిప్పిరెడ్డిపల్లె, అనంతరంపు, రాజుపాళెం, వెదురూరు గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం బీజేపీ ఆధ్వర్యంలో ప్రజాపోరు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మైదుకూరు నియోజకవర్గ కన్వీనర్ మాచనూరు సుబ్బరాయుడు మాట్లాడుతూ ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు బీజేపీ ప్రజాపోరు నిర్వహిస్తోందన్నారు. ఈ క్రమంలో పార్టీ కార్యకర్తలతో కలిసి ప్రతి గ్రామంలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కాశినాయన : మండల కేంద్రమైన నరసాపురంలోని మోడల్ పాఠశాలలో 2024–25 విద్యా సంవత్సరంలో 6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ సౌజన్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓసీ, బీసీ విద్యార్థులు రూ.150, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.75లు ఫీజు చెల్లించి ఈ నెల 31వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. రిజర్వేషన్లు, ప్రవేశపరీక్షలో వచ్చిన మార్కుల ఆధారంగా సీట్లు కేటాయిస్తామని తెలిపారు. వివరాలకు 9010793182 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని ఆమె కోరారు.

ముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయ చైర్మన్‌గా రాజారెడ్డి

ప్రొద్దుటూరు కల్చరల్ : రామేశ్వరంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ ముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయ కమిటీ చైర్మన్‌గా మార్తల రాజారెడ్డి శనివారం ఆలయంలో ఉదయం 10 గంటలకు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ధర్మకర్తలుగా సన్నుతి శ్రీనివాసులు, కామిశెట్టి సుప్రియ, డాక్టర్ నల్లపోతుల కాత్య, యల్లనూరు జ్యోత్స్న, ఎం.తులశమ్మ, ఎక్స్ అఫిషియో మెంబర్‌గా బీ.రాజశేఖర్ శర్మ ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ప్రమాణ స్వీకారానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే శివప్రాదరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీదేవి, వైస్ చైర్మన్ బంగారు మునిరెడ్డి, ఆప్కాబ్ చైర్‌పర్సన్ ఝాన్సీరాణి పాల్గొననున్నారు.

సీఎం జగన్ పాలన స్వర్ణయుగం

- ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందించాం
- అభివృద్ధిని విస్మరించిన గత ప్రభుత్వాలు
- ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



భూమిపూజ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : సీఎం జగన్ పాలన స్వర్ణయుగం అని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి కొనియాడారు. గోపవరం గ్రామ పంచాయతీ పరిధిలోని హౌసింగ్ బోర్డు కాలనీలో రూ.కోటి 20 లక్షలతో నిర్మించనున్న డ్రైనేజీ కాలువ నిర్మాణానికి ఎమ్మెల్యే శుక్రవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు అడిగిన అన్ని కార్యక్రమాలు అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందించిందన్నారు. అందువల్ల వైఎస్సార్‌సీపీ నేతలందరూ తిరిగి తమకు ఓటు వేయాలని ప్రచారం చేస్తున్నారని తెలిపారు. గతంలో ఏ ప్రభుత్వం ఇలాంటి అభివృద్ధి చేయలేదని విమర్శించారు. గోపవరం గ్రామ పంచాయతీ పరిధిలోని హౌసింగ్ బోర్డులో రూ.4 కోట్లతో పార్కు నిర్మిస్తున్నామని, భగత్‌సింగ్ కాలనీలో 5 వీధులకు రూ.కోటి 75 లక్షలతో డ్రైనేజీ కాలువలను నిర్మిస్తున్నామని ప్రకటించారు. పెన్నానది నుంచి తాగునీటిని అందించామని గుర్తుచేశారు. గోపవరం గ్రామ పంచాయతీని బృందావనంలా తయారు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ గద్దా మోష, మాజీ సర్పంచ్ దేవీప్రసాద్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు కొండన్న, ఎంపీటీసీ ఓబయ్య యాదవ్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, జేసీఎస్ జిల్లా కోఆర్డినేటర్ కల్లూరు నాగేంద్రారెడ్డి, ఆర్‌పీసీఏ మెంబర్ కాకర్ల నాగశేషారెడ్డి, సచివాలయ కన్వీనర్ వెంకటేశ్వరరెడ్డి, వైఎస్ ఎంపీపీ దస్తగిరిరెడ్డి, వెంకటరాముడు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాగభరత్‌రెడ్డి, వార్డు మెంబర్ ఆదినారాయణ పాల్గొన్నారు.

15వ వార్డులో భూమి పూజ

మున్సిపాలిటీ పరిధిలోని 15వ వార్డులో రూ.40 లక్షలతో నిర్మించనున్న సిమెంటు రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి శుక్రవారం భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ముదిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి, మాజీ కౌన్సిలర్ శివకుమార్‌యాదవ్, టౌన్ బ్యాంకు చైర్మన్ యెల్లాల కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్బీ నిర్మాణానికి భూమి పూజ

ఎంబజీ లే అవుట్ పరిధిలోని ఆర్బీ నిర్మాణానికి ఎమ్మెల్యే శుక్రవారం భూమి పూజ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీదేవి, కౌన్సిలర్ బాలాజీ, తొగటవీరక్షత్రియ సంఘం జిల్లా అధ్యక్షుడు బండారు సూర్యనారాయణ పాల్గొన్నారు.

జగనన్న ప్రభుత్వంలోనే గ్రామాల అభివృద్ధి

రాజుపాళెం : జగనన్న ప్రభుత్వంలోనే రాష్ట్రంలో గ్రామాలు అభివృద్ధి చెందాయని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి సోదరుడు రాచమల్లు కిరణ్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని వెల్లాల, కుమ్మరపల్లె గ్రామాల్లో శుక్రవారం కిరణ్‌కుమార్‌రెడ్డితో పాటు ఆయన కుమారుడు రాఘవేంద్రారెడ్డి ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేయాలని అభ్యర్థించారు. కిరణ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో ప్రతి పంచాయతీలో సచివాలయం, రైతు భరోసా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేశారన్నారు. మళ్లీ జగనన్నను సీఎంగా, అవినాష్‌రెడ్డిని ఎంపీగా, రాచమల్లు శివప్రసాదరెడ్డిని ఎమ్మెల్యేగా భారీ మెజారిటీతో గెలిపించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు జంగం రెడ్డి భాస్కర్‌రెడ్డి, వెంకటరామిరెడ్డి, మురళీమోహన్‌రెడ్డి, సుదర్శన్, ప్రశాంత్, వైఎస్ ఎంపీపీ నారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రాజారాంరెడ్డి, సచివాలయాల కన్వీనర్ శేఖర్‌రెడ్డి, మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ సూర్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

చిరునవ్వుతో ప్రజలు స్వాగతిస్తున్నారు

ఎన్నికల ప్రచారం చేస్తున్న సందర్భంలో ప్రజలంతా చిరునవ్వుతో స్వాగతం పలుకుతున్నారని రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డులో శుక్రవారం శివప్రసాదరెడ్డి, ఆయన సతీమణి రాచమల్లు రమాదేవి ఎన్నికల ప్రచారం చేశారు. ఫ్యాన్ గుర్తుకు ఓటేసి ఎమ్మెల్యేగా రాచమల్లు శివప్రసాదరెడ్డిని, ఎంపీగా వైఎస్ అవినాష్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తాము ఇళ్ల వద్దకు వెళ్లినప్పుడు మహిళలు బయటికి వచ్చి జగనన్నకు మళ్లీ ఓటు వేస్తామని చెబుతున్నారని పేర్కొన్నారు. ఏ వార్డుకు వెళ్లినా ప్రజల నుంచి అనూహ్య స్పందన వస్తోందన్నారు. సంక్షేమం పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకున్నారని తెలిపారు. 14వ వార్డు పరిధిలోని ప్రజలకు సంక్షేమ పథకాల ద్వారా రూ.35 కోట్లు అందాయని, రూ.2 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. అధ్వానంగా ఉన్న మున్సిపల్ ఉర్దూ ప్రాథమిక పాఠశాలను రూ.45 లక్షలతో నిర్మించామని తెలిపారు. పట్టణంలో కొత్తగా నాలుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను నిర్మించామని, రూ.53 కోట్లతో మార్కెట్‌ను నిర్మిస్తున్నామన్నారు. ఆర్టీసీ బస్టాండ్ పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీదేవి, వైస్ చైర్మన్ ఆయిల్ మిల్లు ఖాజా, కౌన్సిలర్లు జిలాన్, మస్తాన్, అహ్మద్, జాఫర్, మార్కెట్ ఖాసీం, సత్యం, వంశీధర్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్ ఆబీద్, ఫయాజ్, బాషా, రజక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాశయ్య, కోఆపరేటివ్ స్టోర్స్ అధ్యక్షురాలు కళావతి, గుమ్మళ్ల పద్మ, నిర్మల, ఆలిండియా రేడియా స్టేషన్ మాజీ డైరెక్టర్ విజయసారథి, రమాదేవి, జిలాన్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పవన్‌రెడ్డి, నాయీబ్రాహ్మణ సంఘం పట్టణాధ్యక్షుడు కిశోర్‌కుమార్, సురేష్, అంజుమన్ కమిటీ అధ్యక్షుడు బొల్లవరం బాషా పాల్గొన్నారు.

ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు



పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు

ప్రొద్దుటూరు కల్చరల్ : ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. పట్టణంలోని భావన, దీప్తి, అభ్యాస్, శ్రీవిద్య, షిర్డిసాయి, గీతం, విజ్ఞాన్, శారద, నారాయణ, ప్రభుత్వ జూనియర్ కాలేజీ, ప్రభుత్వ ఉర్దూ జూనియర్ కాలేజీల్లో ప్రథమ సంవత్సరం విద్యార్థులు సంస్కృతం, తెలుగు, ఉర్దూ, హిందీ పరీక్షలు రాశారు. ఒక నిమిషం ఆలస్యమైనా పరీక్షకు అనుమతించకపోవడంతో విద్యార్థులు అరగంట ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

రేపు ఐఎంఏ రీజినల్ అకాడమిక్ కాన్ఫరెన్స్

ప్రొద్దుటూరు క్రైం : ఎర్రగుంట్ల రోడ్డులోని త్యాగరాజరెడ్డి కల్యాణ మండపంలో ఆదివారం ఏపీ స్టేట్ ఐఎంఏ జోన్-3 రీజినల్ అకాడమిక్ కాన్ఫరెన్స్ నిర్వహించనున్నట్లు ప్రొద్దుటూరు ఐఎంఏ ప్రెసిడెంట్ డాక్టర్ జీవీజీ మహేష్, కార్యదర్శి డాక్టర్ హరీష్ కుమార్ తెలిపారు. ఐఎంఏ హాల్‌లో శుక్రవారం సాయంత్రం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏపీఎంఎస్ఐడీసీ చైర్మన్ డాక్టర్ బి. చంద్రశేఖర్‌రెడ్డితో పాటు ఐఎంఏ స్టేట్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎం జయచంద్రనాయుడు, ప్రధాన కార్యదర్శి డాక్టర్ పి ఫణీందర్ తదితరులు హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణంలోని వైద్యులందరూ పాల్గొనాలని కోరారు.

అభివృద్ధి చేశాం.. ఆశీర్వదించండి

- టీడీపీ నేతల అసత్య ప్రచారాన్ని నమ్మొద్దు
- ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ



చెన్నకేశవస్వామి ఆలయంలో ఎమ్మెల్సీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే సుధ

బద్వేలు అర్బన్ : కులం, మతం, పార్టీలకతీతంగా అర్హతే ప్రామాణికంగా అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను అందజేసిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధలు కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలోని 20వ వార్డులోని చెన్నంపల్లె గ్రామంలో ప్రజాదీవెన కార్యక్రమం నిర్వహించారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో జరుగుతున్న అభివృద్ధిని ప్రజలకు వివరించి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ మున్సిపాలిటీకి ఇవ్వని విధంగా బద్వేలు మున్సిపాలిటీ అభివృద్ధి కోసం రూ.130 కోట్లు నిధులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంజూరు చేశారని తెలిపారు. గత టీడీపీ ప్రభుత్వం హయాంలో మున్సిపాలిటీ అభివృద్ధిని ఏమాత్రం పట్టించుకోని టీడీపీ నాయకులు ఎన్నికల్లో గెలవడానికి అసత్య ప్రచారాలతో ప్రజల ముందుకు వస్తున్నారని, వారిని నమ్మవద్దని సూచించారు. జనబలం లేని టీడీపీ నాయకులు పొత్తులతో ప్రజల వద్దకు వస్తున్నారని ఎద్దేవాచేశారు. జన్మభూమి కమిటీల అవినీతి పాలన కావాలో.. అవినీతి రహిత పాలన కావాలో ప్రజలు ఆలోచించాలని కోరారు. అంతకుముందు చెన్నంపల్లె గ్రామంలోని పురాతన ఆదిచెన్నకేశవస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు నిమ్మకాయల సుధాకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ యువ నాయకులు దేవసానిఆదిత్యరెడ్డి, మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, కుడా చైర్మన్ గురుమోహన్, వక్ఫ్‌బోర్డు చైర్మన్ మదీన దస్తగిరి, ఆయా కార్పొరేషన్ల డైరెక్టర్లు సుందర్‌రామిరెడ్డి, కేశవరెడ్డి, గిద్దలూరు అసెంబ్లీ ఎన్నికల పరిశీలకులు బంగారు శీనయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ పుత్తా శ్రీరాములు, వైస్‌చైర్మన్ సుబ్బారెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్ గోపాలస్వామి, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి పోలిరెడ్డి యద్దారెడ్డి, నియోజకవర్గ అధికార ప్రతినిధి సింగమాల వెంకటేశ్వర్లు, ఆయా వార్డు కౌన్సిలర్లు రమాదేవి, వెంకటేశ్వర్లు, చెన్నకృష్ణారెడ్డి, శివయ్య, శంకర్‌రెడ్డి, రమేష్‌బాబు, నారాయణరెడ్డి, వీరనారాయణరెడ్డి, మౌలాలి, షఫి, వార్డుల ఇన్‌చార్జిలు, బూత్ కన్వీనర్లు పాల్గొన్నారు.

ప్రజల చెంతకే పరిపాలన

కాశినాయన : ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రజల చెంతకే పరిపాలనను తీసుకువచ్చారని డీసీ గోవిందరెడ్డి, డాక్టర్ సుధ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని వద్దమాను, ఇటుగుల్లపాడు, సావిశెట్టిపల్లె గ్రామాల్లోని గ్రామ సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలు, వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2 వేల జనాభాకు ఒక సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రజలకు గ్రామంలోనే సత్వర సేవలు అందిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువ నాయకులు దేవసాని ఆదిత్యారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ హనుమంతరెడ్డి, ఏపీ ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ చిత్తా విజయప్రతాప్‌రెడ్డి, సర్పంచ్‌లు సౌమ్య దీప్తి, చిత్తా రవిప్రకాష్‌రెడ్డి, పీఆర్ ఈఈ నాగరాజు, డీఈ, ఏఈ, వైఎస్సార్‌సీపీ నాయకులు గురివిరెడ్డి, రమణారెడ్డి, రామారావు, సూర్యనారాయణరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, సురేష్, శేషయ్య, మారారెడ్డి, రమణారెడ్డి, కృష్ణారెడ్డి, నాగసుబ్బారెడ్డి, ఆయా సచివాలయాల సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

నిండు జీవితానికి రెండు పోలియో చుక్కలు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ నుంచి సర్వోదయ ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం పల్స్ పోలియోపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు డాక్టర్లు శివప్రసాద్‌రెడ్డి, హిమబిందు మాట్లాడుతూ ఈ నెల 3న ఆదివారం పల్స్ పోలియో బూత్‌లో అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి 5 సంవత్సరాల పిల్లల వరకు పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. నిండు జీవితానికి రెండు పోలియో చుక్కలు చాలు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు ఎంవీ సుబ్బారెడ్డి, హైస్కూల్ పీడీ నడిగడ్డ సుధాకర్, హెల్త్ సెక్రటరీ జ్యోతి, ఆశా కార్యకర్త పుష్పకుమారి, విద్యార్థులు పాల్గొన్నారు.

పల్స్ పోలియోను విజయవంతం చేయాలి

చాపాడు : ఈ నెల 3వ తేదీన నిర్వహించనున్న పల్స్ పోలియోను విజయవంతం చేయాలని వైద్యాధికారి డాక్టర్ ఓబులేసు పిలుపునిచ్చారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం వైద్య సిబ్బంది పల్స్ పోలియోపై చాపాడులో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ మార్చి 3న మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో పోలియో చుక్కలు వేయటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ సరస్వతి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పల్స్ పోలియోకు సర్వం సిద్ధం

ప్రొద్దుటూరు క్రైం : పల్స్ పోలియో కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని కామనూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ హనీఫ్ బాబా తెలిపారు. శుక్రవారం పీహెచ్‌సీలో పల్స్‌పోలియో పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 3న ఆదివారం జరిగే పల్స్ పోలియో కార్యక్రమంలో అప్పుడే పుట్టిన శిశువు నుంచి ఐదేళ్ల పిల్లల వరకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయాలని సూచించారు. అన్ని గ్రామాల్లోని అంగన్‌వాడీ, ఆరోగ్య కేంద్రాలు, బస్టాండ్, రైల్వేస్టేషన్, నాలుగు రోడ్ల కూడళ్లలో పోలియో చుక్కలు వేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ కృష్ణమ్మ, సూపర్‌వైజర్ బీఏ వరప్రసాద్, ఫార్మాసిస్టు శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా దీపోత్సవం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శ్రీ అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో శివదీక్షా బృందం ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా శివదీపోత్సవం నిర్వహించారు. వేకువజామున అగస్త్యేశ్వరస్వామికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రాజరాజేశ్వరి అమ్మవారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చన నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. లోకకల్యాణార్థం, గణపతి, నవగ్రహ, రుద్ర స్వాహాకార హోమాలు నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. సాయంత్రం అగస్త్యేశ్వరస్వామి, రాజరాజేశ్వరి మాత ఉత్సవ విగ్రహాలను పురవీధుల్లో శివనామస్మరణల మధ్య గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోవాలి

చాపాడు : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ మల్లేష్ సూచించారు. మండలంలోని మడూరు గ్రామంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రజలకు అన్ని రకాలైన వైద్య పరీక్షలు నిర్వహించటం జరుగుతుందని, రోగులకు అవసరమైన మందులు ఇస్తున్నారని తెలిపారు. వైద్యులు రాజేష్‌కుమార్, కావ్యమాధురి, ఆశా నోడల్ ఆఫీసర్ సుకన్యదర్శి భాగ్యలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

డిజిటల్ లైబ్రరీని ఉపయోగించుకోండి

పోరుమామిళ్ల: పోరుమామిళ్ల మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన డిజిటల్ లైబ్రరీని అందరూ సద్వినియోగం చేసుకోవాలని డీసీ గోవిందరెడ్డి, డాక్టర్ సుధ సూచించారు. ఎమ్మార్సీ భవనం వద్ద నూతనంగా నిర్మించిన మహిళా స్వయం సహాయక సంఘాల భవనంలో శుక్రవారం డిజిటల్ లైబ్రరీని ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ ప్రసాద్, వైస్‌ఎంపీపీ సీఎం బాషా, సింగల్‌విండో అధ్యక్షుడు వెంగల్‌రెడ్డి, ఉప సర్పంచులు రుద్రవరం ప్రసాద్, రాళ్లపల్లె రవికుమార్, ఎంపీటీసీలు మహబూబ్‌పీరా, ఇస్సాక్, కోఆప్షన్ మెంబర్ అల్లా, మాజీ సర్పంచ్ ఆదిబోయిన కొండయ్య, మదర్ థెరిసా ఫౌండేషన్ ట్రస్టీ ప్రణీత్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆకలి తీర్చడం గొప్పకార్యం

ఏ ఒక్కరూ ఆకలితో బాధపడకూడదనే ఉద్దేశంతో మదర్ థెరిసా ఫౌండేషన్ ఆధ్వర్యంలో రెండేళ్లుగా అన్నార్థుల ఆకలి తీర్చడం గొప్ప విషయమని డీసీ గోవిందరెడ్డి, డాక్టర్ సుధ ప్రశంసించారు. మదర్ థెరిసా ఫౌండేషన్ ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం క్యాంటిన్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, ఫుడ్ కమిషన్ రాష్ట్ర చైర్మన్ చిత్తా విజయప్రతాప్‌రెడ్డి, యువనాయకుడు ఆదిత్యరెడ్డి హాజరయ్యారు.

ఒంటరి మహిళకు ఆర్థిక సహాయం

గిరినగర్‌కు చెందిన దాసరిపల్లె మేరీ ఒంటరి మహిళ. తనకు సహాయం చేయాలని సర్పంచ్ చిత్తా రవిప్రకాష్ రెడ్డిని ఆశ్రయించింది. దీంతో ఆయన మదర్ థెరిసా ఫౌండేషన్ ద్వారా ఆమెకు ఆర్థిక సహాయం అందించారు. శుక్రవారం ఆమె మహిళ ఏర్పాటు చేసుకొన్న బంకును ఎమ్మెల్సీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మదర్ థెరిసా ఫౌండేషన్ విదేశీ డోనర్స్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.